# అశోకములు

రావినూతల సువర్ణా కన్నన్

సాయంత్రం మహిళా మండలికి వెళ్ళి పేక ఆడు కుంటుండగా వచ్చింది సెక్రటరీ వాసంతి. వూరికే కాదు, ఆటం బాంబ్‌లాంటి ఓ వార్తతో సహా!

ఆ వార్త వినగానే మా చేతుల్లోని పేక ముక్కలు కిందికి జరిపోయాయి. కళ్ళు విశాలమయ్యాయి. నోళ్ళు తెరుచుకున్నాయి విస్మయంగా.

"ఏవిటర్రా! అలా అయిపోయారు? విఠలాచార్య సినిమాల్లో మాంత్రికుడొచ్చి శిలలుగా మార్చినట్టు?" అంది వాసంతి.

అందరం బిలబిల్లాడుతూ ఆమె చుట్టూ చేరాం. ప్రశ్నలతో వుక్కిరి బిక్కిరి చేసేశాం.

ఆవిడ అర్జునుడికి గీతోపదేశం ఇచ్చే శ్రీ కృష్ణ పరమాత్మలా పోజు పెట్టి, విషయమంతా వివరించింది.

అందరి మొహాల్లోనూ అదోలాంటి షాక్, గుసగుసలు మొదలయ్యాయి. నాకైతే కాళ్ళూ చేతులూ ఆడడం లేదు.

"మీరు సరిగ్గా కనుక్కున్నారా? అనుమానంగా చూస్తూ అడిగాను వాసంతిని. నేనా మహిళా మండలికి ప్రెసిడెంటుని.

"భలేవారే! సరిగ్గా కనుక్కోందే ఇంత హడావిడిగా పరిగెత్తుకొచ్చి చెప్తానా? కనుక్కోవడం కాదు. నా చెవులతో నేనే విన్నాను. మా ఇంటికీ, వాళ్ళింటికీమధ్య గోడేకదండీ అడ్డం!" అంటూ మరోసారి తను విన్నవన్నీవివరంగా చెప్పింది వాసంతి.

నాకు వెర్రి ఆనందం వేసింది.

అలా అన్నానని నన్ను అపార్థం చేసుకోకండి. నేను మంచిదాన్నే. నా మనసు నవనీతంలాంటిదని మా మండలి సభ్యులు, కమిటీ మెంబర్లూ... వీళ్ళనేవిటి, చాలామందే అంటారు.

కానీ జయంతి అలా కాదే!

ఆవిడగారు పేరుకి మా మండలి మెంబరే అయినా ఏనాడూ మండలిలో అడుగు పెట్టలేదు. అదేమంటే "నాకు పేకాటలూ అవీ రావండీ" అంటూ నవ్వేస్తుంది. అక్కడికి పేకాడే వాళ్ళంతా పనీ పాటూ లేనివాళ్ళలా మొహం పెట్టి.

నిజానికి మేం సాయంత్రాలు అక్కడికెళ్ళి పేకాట ఆడతామే అనుకోండి దాని వల్ల ఎవరికేం నష్టం?

అదీగాక ఆవిడగారికి మహా గర్వం.

వాళ్ళాయన డాక్టరు. కొడుకులిద్దరూ తెలివి గలవాళ్ళని పెద్దపోజు! ఆ నా మొహం. ఏం తెలివి లెండి! ఆ పసి వాళ్ళని చిన్నప్పుడే చదువులకంటూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కి పంపేసి, టింగురంగా అంటూ ఇద్దరూ తిరిగే వాళ్ళు. అయినా చిన్న పిల్లలన్న జాలైనా లేకుండా పిల్లల్నిలా వాళ్ళు కాబట్టి పంపగలిగారు గానీ,



మా ఎత్తు ధనం పోసినా మేం పంపుతామా? ఏమో బాబూ! మా పిల్లల్నొదిలి ఒక్క రోజుండలేం.

ఏదో వాళ్ళు చదివిన స్కూలు మంచిదవడం మూలంగా వాళ్ళు కాస్త మంచి చదువులే చదివారనుకోండి. అయినా వాళ్ళలా చదివేవాళ్ళు ఎంతమంది లేరు? ఆ జయంతి మహా తెలివిగలది. తన గొప్పలు తను చెప్పుకోదు. మరొకళ్ళ చేత చెప్పిస్తుంది. లేకపోతే పిల్లల్నొదిలి వుండలేక మేం పంపకపోతే–

"మీరు పంపినా మీ పిల్లలకక్కడ సీట్లు రావు లెండి!" అని పక్కింటి తాయారు చేతనిపిస్తుందా?

అలా మిడిసి పడిన వాళ్ళకి మంచి శాస్తే జరిగింది. అలా అనుకోవడంలోనా తప్పుందంటారా?

"ఏవిటి ఆలోచిస్తున్నారు?" అంది వైస్ ప్రెసిడెంటు కమలాదేవి.

"ఏం లేదు. పాపం! ఆ జయంతి..."

"పాపం ఏమిటండీ! పాపం! ఆవిడకి అలా జరగాల్సిందే... ఇప్పటికే భూమ్మీద నిలవడంలేదు. ఇంకా ఆ కొడుకు చదువు పూర్తి చేసుకువస్తే మనల్ని మనుష్యుల కిందే చూడదు." ఈసడింపుగా అంది నా స్నేహితురాలు నిర్మల. జయంతిని గురించి నేను జాలి పడ్డం పై మాటకే అని ఆమెకి బాగా తెలుసు.

"వస్తానర్రా" అంటూ లేచాను.

"అదేవిటి మరి నాలుగు రౌండ్లు ఆడదాం వుండండి" అంది పేకాటంటే పడి చచ్చే రంగనాయకమ్మ.

"లేదు. పనుంది." అంటూ బైటపడి కార్లో కూర్చున్నాను. ఈ వార్త మావారికి ఎప్పుడు చెప్తామా అని తెగ ఆరాటంగా వుంది. ఇలాంటి విషయాలు ఆయన చెవిన వేస్తేనే గానీ నాకు వూపిరందినట్టుండదు.

కారు వేగంగా పరిగెత్తి మా ఇంటి కాంపౌండులో ఆగింది. కారు ఆగగానే అందులోంచి దూకినట్టు లోపలికి పరిగెత్తాను.

అదృష్టవశాత్తూ మావారు ఇంట్లోనే వున్నారు.

"ఈ వార్త విన్నారా?" అన్నాను తెగ ఆయాస పడిపోతూ.

చూస్తున్న పేపరు పక్కన పడేసి–

"ఏ వార్త?" అన్నారాయన కుతూహలంగా. నాలాగే మావారిక్కూడా ఇతరుల విషయాలు వినడమంటే చాలా ఇష్టం.

నేను ఆయన కెదురుగా వున్న సోఫాలో కూలబడ్డాను.

"చెప్పు!" అన్నట్టు చూశారాయన ఆలస్యం భరించలేనట్టు.

నేను ముసి ముసిగా నవ్వాను.

ఆయన మొహంలో భరించలేని ఆత్రుత.!

"మన కృష్ణమూర్తిగారబ్బాయి అమెరికా వెళ్ళాడు కదా!" అన్నాను.

"ఇది పాత సంగతేగా?" అన్నారాయన.

"అది పాత సంగతే! మరో కొత్త సంగతి తెలిసింది. కొత్త సంగతి అనేకన్నా దారుణమైన సంగతి అంటే బావుంటుందేమో" అన్నాను. ఎంతదాచుకుందామన్నా నా గొంతులోని ఆనందం దాగడం లేదు.

ఆయనకు కుతూహలం మరింత పెరిగింది.

"తొందరగా చెప్పు! అతగాడేం చేశాడు? కొంపతీసి ఏ అమెరికా అమ్మాయినో కట్టుకున్నాడా?" అన్నారు ఆత్రుతగా.

"కాదు" అన్నట్టు తల అడ్డంగా తిప్పాను.

"మరి?"



బంగాళా దుంప చిప్స్ చేసేటప్పుడు ఈసారి ఈ విధంగా చేయండి. చల్లటినీటిలో ఒక చెంచా ఉప్పు వేసి... బంగాళా దుంప స్లయిస్‌ను ముందుగా నీటిలో వేయండి సావుగంట తరువాత... నీటిని తీసి, వేయించుకోండి. ఇవి ఇక రుచిగా కరకరలాడు తుంటాయి.

* * *

మూత తీసి వేసిన ఖాళీ సెంటు సీసాను బీరువాలో బట్టల మధ్య పెడితే బట్టలు ముగ్గిపోయిన వాసన పోయి మంచి సువాసనగా ఉంటాయి.

నేను గొంతులోకి కాస్త బాధని తెచ్చుకుని–

"పాపం! తేజ..." అని క్షణం ఆగాను.

"ఏమైంది? తేజకేమైంది!" అరిచినట్టు అన్నారాయన.

"అతనికి ఎయిడ్స్ వ్యాధి వచ్చిందిటండీ!" విషయం చెప్పేశాను.

"ఛ!ఛ!" కెవ్వుమన్నట్టు అన్నారాయన.

"మొన్న ఆదివారం అమెరికాలో అదేదో హాస్పటలు పేరు గుర్తులేదు. అందులో చేర్చారట." అంటూ వాసంతి చెప్పిన విషయాలన్నీ చెప్పాను.

"పాపం" అన్నారాయన భారంగా

"పాపం ఎందుకు? ఆ కృష్ణ మూర్తికి అతగాడి భార్యకీ ఎంత పొగరు? ఎంత సేపూ వాళ్ళ పిల్లల్నిపొగుడు కొవడమేగానీ ఎదుటి వాళ్ళ పిల్లల్ని ఏనాడైనా మెచ్చుకున్నారా?

"మొన్నటికి మొన్న, మనవాడికి డొనేషను కట్టామని తెలిసి–

"మా పిల్లలు చదువుకున్నారు గానీ చదువు 'కొన'లేదు." అందట ఆ జయంతి. ఇప్పుడేం చెప్పుకుంటుందట?" కసిగా అన్నాను.

"అవును! మన వాడి సీట్ కోసం కర్ణాటక వెళ్ళి అక్కడ డబ్బుకట్టొచ్చానా? తీరా మనవాడు ఇంటరు తప్పె! అసలే నేను దాన్ని గురించి బాధపడుతుంటే–

"డబ్బుంటే చాలదండీ! పిల్లల భవిష్యత్తుని గురించి ఆలోచించాలి. వాళ్ళకో క్రమ శిక్షణ నేర్పాలి." అంటూ పెద్ద లెక్చరిచ్చాడా కృష్ణమూర్తి. అలాంటి వాళ్లకిలా జరగాల్సిందే!" అన్నారు మావారు కూడా.

"అవును మనకి డబ్బుంది. ఎన్ని డొనేషన్లయినా కట్టుకుంటాం. ఎన్ని డిగ్రీలన్నా కొనుక్కుంటాం. మధ్యన వీళ్ళకెందుకట కడుపు మంట?"

"కడుపు మంట కాక మరేమిటి. మనకున్నన్ని ఆస్తిపాస్తులు వాళ్ళకెక్కడివి? అందుకే ఈ ఏడుపు!"

"ఈ వార్త నిజమేనంటావా?" ఆయన గొంతులో ఏదో అనుమానం!

"అయ్యో మీఇల్లు బంగారంగానూ! స్వయంగా విన్నవాళ్ళు చెప్తే నమ్మనంటా రేవిటండీ. అంతే కాదు రాత్రి నుంచీ ఆ కృష్ణమూర్తి, జయంతీ కూడా వీధి మొహం చూడకుండా తలుపులు బిగించుక్కూర్చున్నారట. మన వాసంతి చెప్పింది."

"అయితే మా వాళ్ళందరికీ ఫోన్ చేస్తాను" అంటూ వుత్సాహంగా లేచారు మావారు. అయితే ఈ వార్త అప్పుడే చాలా మందికి తెలిసిపోయింది. కృష్ణమూర్తి కొడుకు తేజ ఇక్కడ డాక్టర్ చదువు పూర్తి చేసుకుని పై చదువు కోసం అమెరికా వెళ్ళాడని చాలామందికి తెలుసు. ఇప్పుడు ఎయిడ్స్ వ్యాధి వార్తే తాజా వార్త. ఆ వార్త వినీ వినగానే కృష్ణమూర్తి దంపతులు కుప్పకూలిపోయి మంచం పట్టారని కూడా కొందరు చెప్పారు.

"ఓసారి పరామర్శించి వద్దామా!" అన్నాను.

"ముందు మా క్లబ్ కెళ్ళి విషయం మా వాళ్ళందరికీ చెప్పొస్తాను" అంటూ ఆదరా బాదరా వెళ్ళి అరగంటలోగానే తిరిగొచ్చేశారాయన.

తర్వాత ఇద్దరం కలిసి కృష్ణమూర్తి ఇంటికేసి వెళ్ళాం, సాధ్యమైనంత దిగులుగా మొహాలు పెట్టి.

మేం వెళ్ళే సరికి కృష్ణమూర్తి, జయంతి చెరొక మంచం మీద పడుకుని వున్నారు. మొహాలు పీక్కుపోయాయి. మమ్మల్ని చూడగానే లేచి చిరునవ్వుతో ఆహ్వానించి కూర్చో

బెట్టారు. వాళ్ళిద్దరి నవ్వులోనూ సహజత్వం లేదని అనిపించింది.

"మా ఇద్దరికీ ఫ్లూ జ్వరాలు! ఒకేసారి పడక వేశాం" బలవంతంగా నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి.

"ఇప్పుడు కూడా దాపరికమే!"అనుకున్నాను.

నా మొహంలోని భావాలని చదివారేమో మావారు-

"అలా చెప్పక ఏం చెప్తారు?" అన్నట్టు చూశారు నాకేసి.

కాస్సేపు లోకాభిరామాయణం మాటలు అయ్యాయి. విషయం ఎలా అడగాలా అన్న ఆలోచన మా ఇద్దరి మనసుల్లోనూ తొల్చేస్తోంది.

"అమెరికాలో మీ వాడెలా వున్నాడు?" అన్నాను జయంతితో.

"బానే వున్నాడు" అందామె క్లుప్తంగా.

ఇంకెలా అడగాలో అర్థం కాలేదు. చివరికి మావారు ధైర్యం చేసి-

"నేనో మాటవిన్నాను. నిజమేనా?" అన్నాడు కృష్ణమూర్తితో.

"ఏమిటి?" అన్నాడతను.

"మీ వాడికి ఎయిడ్..."

"అవును వచ్చింది!" మావారి మాట పూర్తి కాకుండానే అన్నాడు కృష్ణమూర్తి.

"చూశారా! నేను చెప్పలేదూ?" అన్నట్టు చూశాను మావారి కేసి.

ఇంతలో నౌకరు కాఫీలు తెచ్చాడు. మేమిద్దరం మొహాలు చూసుకున్నాం.

"ఇంతకు ముందే తాగొచ్చామండీ!" అంటూ సున్నితంగా చెప్పి తప్పించుకున్నాం, ఆ కాఫీలు తాక్కుండా.

వాళ్ళిద్దరూ బావురుమంటే ఓదార్చాలని మా ప్రయత్నం. కానీ వాళ్ళు మాకా అవకాశం ఇవ్వడమే లేదు. ఏదేదో మాట్లాడుతున్నారు.

అయినా కన్న బిడ్డకి ఎయిడ్స్ వ్యాధి సోకితే వీళ్ళ మొహాల్లో దిగులైనా లేదేవిటి చెప్మా?" అనుకున్నాం మేమిద్దరం.

ఎలాగైనా తేజ మాట తేవాలని నిర్ణయించుకున్నాను.

అసలు కృష్ణమూర్తిగారి కుటుంబమంటే మావూరి వారందరికీ అదోలాంటి గౌరవం వున్న మాట నిజమే. వాళ్ళ ఇంటిని స్వీట్ హోమ్అనీ, వాళ్ళ పిల్లల్ని రత్నాలు అనీ కూడా అంటారంతా.

ఈ దెబ్బతో వీళ్ళ అసలు రంగు బైటపడాలి అనుకున్నాను కసిగా. అయితే వాళ్ళా విషయం ఎత్తందే! వాళ్ళు ఎత్తని విషయాన్ని బైటికి లాగి, పాలిపోయిన వాళ్ళ మొహాల్ని చూసి హాయిగా నిట్టూర్చాలన్న కోరిక మరింత పెరిగిపోయింది మాలో


మావారే తెగించి-

"మీరేం బాధపడకండి! మంచివాళ్ళకే కష్టాలు!" అంటూ నిట్టూర్చారు.

"కష్టాలా?"

"కష్టాలు కాకేవిటండీ. అసలిది మీకు రావల్సిన కష్టం కాదండీ! ప్చ్! ఏం చేస్తాం. అంతా ఆ భగవంతుడి లీల! మీరు ధైర్యంగా వుండండి, లేకపోతే జయంతిగారు మరీ కృంగి పోతారు.

"మీరేం మాట్లాడుతున్నారో నాకర్థం కావడం లేదండీ!" అయోమయంగా అన్నాడు కృష్ణమూర్తి.



ఫ్లవర్ వేజ్‌లలో గులాబీ, మొదలైన పూలు వాడకుండా వుండాలంటే ఆ ఫ్లవర్ వేజ్ లోని నీటిలో కొద్దిగా ఉప్పువేయండి. దీని వలన పూలు రెండు మూడు రోజులు అధికంగా వాడకుండా వుంటాయి.

***

నిమ్మకాయ రసం పిండగానే... నిమ్మ బద్దల్ని ఆవతల పారవేయకండి. ప్రతి సారీ ఈ నిమ్మ బద్దల్ని ఒక జాడీలో వేసి ఒక చెంచా ఉప్పు పొడి వేసి జాడీ మూత పెట్టేయండి. ఇలా రసం పిండిన నిమ్మ బద్దలు జాడీలో వేసినప్పుడల్లా ఒక చెంచా ఉప్పువేస్తూవుంటే జాడీ నిండాక దానికి కావలసిన అన్ని మసాలాలు కారం కలి పేయండి. నిమ్మకాయ చట్నీ ఇక రెడీ!

బి.ఎస్.లక్ష్మి

"మనకి ఫ్లూ జ్వరాలు వచ్చినందుకేమో! అదోలాంటి మందహాసంతో అంది జయంతి.

నాకు ఒళ్ళు మండిపోయింది. "ఏన్నాళ్ళు దాస్తారు?" అనుకుని, పైకి మాత్రం.

"ఆదేనండీ, మన తేజకి ఎయిడ్ ఏదో అన బోయాను. అయితే నా మాటలకడ్డొస్తూ-

"ఒస్తే? ఎయిడ్ వస్తే ఆనందించాలి గానీ బాధ పడ్డం, ఓదార్పులు ఎందుకండీ!" అంది జయంతి.

"మేమిద్దరం మొహాలు చూసుకున్నాం.

'ఎయిడ్స్ వస్తే ఆనందించడం ఏమిటండీ? అన్నారు శ్రీవారు అయోమయంగా.

ఆవిడ తుళ్ళిపడి.

"కొంప తీశారు. ఎయిడంటే ఏమనుకుంటున్నారు?" అంది.

"ఆ మాత్రం తెలియదా ఏం? ఏయిడ్సంటే భయంకరమైన వ్యాధి! ఆ వ్యాధి మీ అబ్బాయి కొస్తే అమెరికాలోని ఓ పెద్ద హాస్పటల్లో చేర్చారు." అన్నాను" మీరు దాస్తే మాత్రం మాకు తెలియదా! అన్నట్టు

అంతే!

కృష్ణమూర్తి దంపతులు పడి పడి నవ్వారు. వాళ్ళ నీరసం ఎగిరిపోయిందా నవ్వుతో.

"ఎందుకు నవ్వుతారు?" అన్నాను చిరాగ్గా.

ఆమె నవ్వు తక్కున ఆపి-

"అయితే మీరు మా తేజకి ఎయిడ్స్ వ్యాధి సోకిందని వూహించి, మమ్మల్ని పరామర్శించ డానికి వచ్చారా?' అంది సూటిగా నా కళ్ళలోకి చూస్తూ.

"అవును... ఎంతైనా సాటి వాళ్ళూ... అదీ కాక తేజ బాగా తెలిసిన కుర్రాడు."

"స్టాప్" అరిచినట్టు అన్నాడు కృష్ణమూర్తి.

మేమిద్దరం బిత్తరపోయాం.

కృష్ణమూర్తి మొహం గంభీరంగా అయిపోయింది. నౌకర్ని పిల్చి స్వీట్స్ తెప్పించి మాకిస్తూ-

"సారీ రావుగారూ! మీరూహించినట్టు మావాడి కొచ్చింది ఎయిడ్స్‌వ్యాధి కాదు. ఎయిడ్! మావాడి పై చదువులకి ఎయిడొచ్చింది. అంటే స్కాలర్ షిప్ అన్నమాట. నిన్నమేం మాట్లాడుకుంటుండగా పక్కింటి వాసంతి గారు గోడ దగ్గరే తచ్చాడ్డం గమనించాను గానీ, అది ఇంత దారుణ వార్తని సృష్టిస్తుందని వూహించనైనా వూహించలేదు.

"చూడండి మా పిల్లల తెలివి తేటల్ని ఇండియాలోనే కాదు. పరదేశీయులు కూడా మెచ్చుకున్నారు. ఫలితంగా మీరన్నారే ఆ ఎయిడ్ అదిచ్చారు.... అదీ అమెరికాలోని ఓ మంచి యూనివర్సిటీలో. మావాడు డాక్టరు కాబట్టి మేం హాస్పటల్ అవీ అని మాట్లాడుకున్నాం. దానికి మీరంతా కలిపి చక్కని కథ అల్లి ఆనందించారు. కానీ మీరు ఓదార్చే స్థితిలో మేం లేనందుకు, మిమ్మల్ని నిరాశ పర్చినందుకూ మాకు చాలా బాధగా వుందండీ!" అన్నాడు గంభీర స్వరంతో.

అంతే!

మా మొహాలు మాడిపోయాయి.

"చాలా సంతోషం! వస్తాం" అంటూ లేచి, ఎవరో తరుముతున్నట్టు బైటపడ్డాం. వెనకనించి,

"ఏం మనుషులు, ఏం లోకం, రాబందులకీ వీళ్ళకీ తేడా ఏమిటి" అని కృష్ణమూర్తి అనడం మాకు స్పష్టంగా వినిపించింది. కత్తి వేటుకి నెత్తురు బొట్టు లేని మొహాలతో ఇంటి దారి పట్టాం.